క్లుప్తంగా

ముగ్గుల పోటీలు



మియాపూర్: చందానగర్ డివిజన్‌లోని భవానీ పురం కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, రాఘవులు, ప్రభులయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్ధి రామేశ్వరస్వామి జయంతి

మియాపూర్: శేరిలింగంపల్లి డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలో శనివారం శ్రీ సిద్ధి రామేశ్వర స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేశారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ సమానంగా ఉండాలని కృషి చేసిన మహోన్నత వ్యక్తి రామేశ్వర స్వామి అని అన్నారు. కార్యక్రమంలో స్థానికులు బస్వరాజ్ లింగాయత్, శ్రీకళ, మహేష్ రాపన్, కళ్యాణ్, శివ, విజయ్, భీమయ్య పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్‌గా అల్లావుద్దీన్ పటేల్



నియామకపత్రాన్ని అందిస్తున్న చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ కృష్ణయాదవ్

గచ్చిబౌలి: ఆమ్‌ఆద్మీ పార్టీ శేరిలింగంపల్లి కన్వీనర్‌గా ఎండి అల్లావుద్దీన్ పటేల్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ బర్కాకృష్ణ యాదవ్ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ అసెంబ్లీల వారీగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు.

25 నుంచి బ్రహ్మోత్సవాలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ 52వ బ్రహ్మోత్సవాలను ఈనెల 25 – 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. 25న సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహావచనం, రక్షాబంధనం, వేద పారాయణం, ఆరగింపు, హారతి, తీర్థ ప్రసాద వితరణ, రాత్రి 10 గంటలకు ద్వార బంధనం, 26వ తేదీ ఉదయం 6గంటలకు ప్రభోదిక వేదపారాయణం, 8గంటలకు అభిషేకం, 9.30 గంటలకు హోమం, 10.30 గంటలకు ధ్వజారోహణ, మధ్యాహ్నం 12గంటలకు స్వామి తిరుకల్యాణ మహోత్సవం, 27వ తేదీ సాయంత్రం 4గంటలకు స్వామివారి పల్లకి సేవ, గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని కోరారు.

కనుల విందుగా తిరు కల్యాణోత్సవం

జగద్గిరిగుట్ట: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం జగద్గిరిగుట్ట కొండపై ఉన్న గోవిందరాజ స్వామి ఆలయంలో తిరు కల్యాణోత్సవం నిర్వహించారు. గోదాదేవి, గోవిందరాజ స్వామి ఉత్సవ విగ్రహాలకు వేద పండితుల మంత్రోచ్చనల మధ్య కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరు కల్యాణాన్ని తిలకించారు.

భోగి మంటలు.. చూడచక్క ముగ్గులు

రంగారెడ్డినగర్: భోగి పండుగను శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు మహిళలు భోగి పండుగకు స్వాగతం పలుకుతూ రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. అదే విధంగా ఆయా ప్రాంతాల్లో భోగి మంట వేసి కుటుంబ సమేతంగా పండుగలో పాల్గొన్నారు. నూతన వస్త్రాలు ధరించి, వివిధం వంటకాలతో బంధు మిత్రుల సమేతంగా సుఖసంతోషాల మధ్య భోగి పండుగను జరుపుకున్నారు.

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మైసమ్మనగర్–బీ కమ్యూనిటీ హాలు వద్ద శనివారం సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసిన మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న మహిళలందరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి బండారి రవీందర్ రెడ్డి, కోశాధికారి సంతోష్ పాల్గొన్నారు.



భోగి మంటలు — కోటి వెలుగుల సంక్రాంతులు



ఆదిత్యానగర్‌లో జరిగిన భోగి వేడుకల్లో పాల్గొన్న స్థానికులు



భోగి వేడుకల్లో పాల్గొన్న కూకట్‌పల్లి దేవిస్థాన్ హోమ్స్ నివాసులు

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆయన నివాసం వద్ద కుటుంబ సమేతంగా భోగి మంటలు వేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్‌లు, పాత్రికేయ మిత్రులకు, అధికార, అనధికారులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కాలంతో వచ్చే మార్పులను ఆహ్వానించడానికి సిద్ధంగా ఉండాలని బోధించేదే భోగి పండుగ అని తెలిపారు.

కూకట్‌పల్లి దేవిస్థాన్ హోమ్స్‌లో...

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని దేవిస్థాన్ హోమ్స్‌లో భోగి పండుగను పురస్కరించుకొని పెద్ద ఎత్తున భోగిమంటలు వేశారు. ఉదయం నుంచే దేవిస్థాన్ హోమ్స్‌లోని చిన్నా పెద్ద భోగి వేడుకల్లో పాల్గొని సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. భోగి వేడుకల్లో ఎంఎస్ కమలాకర్, ములుగు ఆనందరావు, గొట్టిముక్కల దేశాల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రిసెంట్ పాఠశాలలో..

మోతీనగర్: బాల్య దశలోనే విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాలు పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపైన ఉందని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహిద్ షరీఫ్ బాబా పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లో క్రిసెంట్ స్కూల్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన రంగవల్లులు, బసవన్న వేషధారణ, గంగిరెద్దుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పర్వత్‌నగర్ అధ్యక్షుడు ఎండీ జాహెద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరాజేశ్వరి వృద్ధాశ్రమంలో..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ సాయినగర్‌లోని శ్రీరాజేశ్వరి వృద్ధాశ్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి శనివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు వేసి మాతృమూర్తులను ఆనందింపజేశారు. సహపంక్తి భోజనాలతో పాటు నూతన దుస్తులను అందజేశారు. ఒంటరిగా సేద తీరుతున్నామనే బాధ లేకుండా పండుగను ఆటపాటలతో సందడి చేసి ఆనందింపజేశారు. ఈ వేడుకల్లో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



భోగి మంటల వద్ద ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కుటుంబ సభ్యులు



క్రిసెంట్ పాఠశాలలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు



ఎన్విరాన్‌మెంట్ ఎన్‌క్లేవ్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న అపార్టుమెంట్ వాసులు



వెంకట్ రెడ్డి అందజేసిన నూతన దుస్తులతో నిర్వాహకురాలు రాజేశ్వరి, వృద్ధులు

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన కారు

చికిత్స పొందుతూ మృతి



రామచందర్ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టడంతో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి అన్న కుమారుడు తెలిపిన వివరాల ప్రకారం... జి.రామచందర్ (50) వివేకానందనగర్‌లోని ఆంధ్రాబ్యాంక్ వద్ద నుంచి సుమిత్రానగర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన (టీఎస్08హెచ్‌సీ5666) కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో రామచందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే రామ్‌దేవ్‌రావ్ ఆసుపత్రికి అతడిని తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి 7గంటలకు మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. రామచంద్రరావు అన్న కుమారుడు జి.మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



భాగ్యనగర్‌కాలనీ: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాంత్‌నగర్ కాలనీలోని శ్రీశ్రీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న హాస్పిటల్ బిల్డింగ్ సమీపంలో వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు వివరాలు సేకరించగా భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని తెలిపారు. అతనికి సంబంధించిన వారు ఎవరూ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

కల్యాణం.. కమనీయం



కూకట్‌పల్లిలోని రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదాదేవి కల్యాణం శనివారం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం గోదా రంగనాయకస్వామి కల్యాణం భక్తుల సాక్షిగా, వేదమంత్రోచ్చరణల మధ్య, మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా జరిగింది. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. – మూసాపేట

విద్యతోపాటు నైపుణ్యాన్ని అందించేందుకు కొత్త కోర్సులు

- హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు
- హెచ్‌సీయూ–టైమ్స్ ప్రో సంస్థల మధ్య ఒప్పందం



వీసీ బీజేరావు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

రాయదుర్గం: విద్యతోపాటు నైపుణ్యాలను అందించేందుకు కొత్త కోర్సుల నిర్వహణకు యత్నిస్తున్నామని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో హెచ్‌సీయూ–టైమ్స్‌ప్రో సంస్థల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థుల కోసం కొత్త కోర్సులను అందుబాటులోకి తేవడానికి అవకాశం కలుగుతుందన్నారు. టైమ్స్ ప్రో సీఎఫ్‌ఓ అరుణ్‌కబ్రా మాట్లాడుతూ సవాళ్లను ఎదుర్కొవడానికి, కార్పొరేట్‌లలో ప్లేస్‌మెంట్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడానికి వారికి తగిన శిక్షణ ఇవ్వడానికి అవకాశం కలుగుతుందన్నారు. మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లొమో ప్రోగ్రామ్‌లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ మేరీ జెస్సికా, సీడీపీఎల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ జిలానీ, హెచ్‌సీయూ ప్రతినిధి డాక్టర్ లోకానందరెడ్డి, టైమ్స్‌ప్రో ప్రతినిధులు కుల్‌దీప్ పరేక్, ఎంవిఆర్ పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

3కిలోలతో ఆంజనేయస్వామికి వెండి తొడుగు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి ప్రసూననగర్ శ్రీకోదండ రామాలయంలోని ఆంజనేయస్వామికి శనివారం కాలనీకి చెందిన మనోజ్‌కుమార్‌రెడ్డి,మధుసూదన్‌రెడ్డి సోదరులు రూ.2.4 లక్షలు వచ్చించి చేయించిన 3 కిలోల వెండి తొడుగును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు తీర్థ ప్రసాదములు, ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అలయ కమిటీ చైర్మన్ ముప్పిడి రాంచందర్, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా గోదాదేవి కల్యాణం



పాండురంగానగర్‌లో గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



వివేకానందనగర్‌లో స్వామివారి కల్యాణంలో భక్తులు

మోతీనగర్: నెల రోజులుగా కొనసాగిన ధనుర్మాస ఉత్సవాలు గోదాదేవి కల్యాణంతో శనివారం ముగిశాయి. మూసాపేట డివిజన్ పాండురంగానగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో డిసెంబర్ 16న ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ముగింపు సందర్భంగా గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యనిర్వహణాధికారి జీఏకే కృష్ణ మాట్లాడుతూ... ధనుర్మాస ఉత్సవాలతో పాటు పలు పండగలతో పాటు గురువారం, శనివారం వంటి రోజుల్లో కూడా ఆలయంలోని పలు దేవతామూర్తులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వివేకానందనగర్‌లో...

మకర సంక్రాంతిని పురస్కరించుకొని అల్లాపూర్‌లోని వివేకానందనగర్‌లోని భూనీల సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో గోదాదేవి కల్యాణం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పులిగొల్ల శ్రీనివాస్‌యదవ్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సిరికి శ్రీనివాస్, బొంత హరికృష్ణ, విజయ్, సైదయ భరత్, ప్రకాష్‌రావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

జంతుశాస్త్రంలో రాణికి డాక్టరేట్




ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జంతుశాస్త్రం విభాగంలో ఎస్.రాణికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.ఏవీ రాజశేఖర్ పర్యవేక్షణలో ఎకోలజికల్ స్టడీస్ ఆఫ్ కొటపల్లి లేక్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ మెటల్స్ ఆన్ ప్లాన్క్టానిక్ డైవర్సిటీ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు చెప్పారు.వికారాబాద్ జిల్లాకు చెందిన రాణి మహాత్మాజ్యోతిరావు పూలే పాఠశాలల్లో టీచర్ ఉద్యోగం చేస్తున్నారు. తన పరిశోధనకు సహకరించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

అవినాష్ గోయల్‌కూ..

ఓయూ ఎంబీఏ విభాగం విద్యార్థి పి.అవినాష్ గోయల్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీనియర్ అధ్యాపకులు ప్రొ.వెంకటయ్య పర్యవేక్షణలో రిక్రూట్‌మెంట్ ప్రాక్టిసెస్ అండ్ సెలక్షన్ ఆఫ్ ఎంప్లాయీస్ ఇన్ ఐటీ ఇండస్ట్రీ–ఏ స్టడీ ఆఫ్ సెలక్ట్ కంపెనీస్ ఇన్ హైదరాబాద్ అనే అంశం పై పరిశోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

జెడ్పీహెచ్‌ఎస్‌కు ఎన్‌టీఆర్ పేరు

- ప్రకటించిన జిల్లా కలెక్టర్ హరీష్
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యేలు
- రూ.కోటి విరాళం అందజేసిన కార్పొరేటర్ మందడి



పాఠశాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, జిల్లా కలెక్టర్ హరీష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీకాలనీ రమ్యాగ్రౌండ్‌లో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శనివారం ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, జిల్లా కలెక్టర్ హరీష్, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ స్కూల్ భవన నిర్మాణానికి కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కోటి రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలకు నందమూరి తారక రామారావు పేరును జిల్లా కలెక్టర్ హరీష్ ప్రకటించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతో ఇప్పటికే నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పరుచుకున్నామన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా విద్యాలయాలను కూడా అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఎంతోకాలంగా నిరుపేద విద్యార్థులు ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల త్వరలోనే నెరవేరబోతుందన్నారు.

◆ కేపీహెచ్‌బీకాలనీలో నిర్మించబోతున్న ఈ పాఠశాలకు నందమూరి తారక రామారావు పేరు పెట్టడం చాలా సంతోషకరమన్నారు. ఆయన లాంటి యుగ పురుషులు మళ్లీ పుట్టబోడని, తామంతా ఆయన శిష్యులమేనని ఆయన పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. ఎంతోమంది నిరుపేదల పిల్లల బంగారు భవిష్యత్‌కు తన వంతుగా రూ.కోటి అందించిన మందడి శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.